సాక్షి
నల్లగొండ
శనివారం । 3 । ఆగస్టు । 2024



వృథా జలాలను ఒడిసిపట్టే..

సాగర్ వృథా జలాలు ఒడిసిపట్టి.. రివర్స బుల్ టర్బైన్లతో తిరిగి సాగర్‌కు మళ్లించేలా టెయిల్‌పాండ్ ప్రాజెక్టు నిర్మితమైంది. - 8లో



సదస్సును జయప్రదం చేయాలి

సాగర్‌లో నిర్వహించే వినియోగదారుల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని క్యాట్‌కో నేత వెంకటేశ్వర్లు కోరారు. - 8లో



మట్టపల్లిలో నిత్యకల్యాణం

మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు నల్లగొండకు మంత్రి కోమటిరెడ్డి రాక

నల్లగొండ : నల్లగొండకు రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం రానున్నారు. నల్లగొండలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో పాల్గొని రాత్రి నల్లగొండలోనే బస చేస్తారు. ఆదివారం కూడా నల్లగొండలోనే పలు కార్యక్రమాల్లో పాల్గొని సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్ వెళ్తారు.

అడవిదేవులపల్లి కేజీబీవీ తనిఖీ



స్టోర్‌ను పరిశీలిస్తున్న జిల్లా అధికారిని సరిత

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని(కేజీబీవీ) శుక్రవారం లింగ సమానత్వ సమన్వయకర్త జిల్లా అధికారి సరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కిచెన్, తరగతి గదులు, స్టోర్, భోజన వసతిని పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట స్వప్న, సుశీల, శిరీషాకుమారీ, స్వప్న తదితరులున్నారు.

మత్స్యశాఖ జిల్లా అధికారిగా చరిత



మత్స్యశాఖ జిల్లా అధికారి చరితను సన్మానిస్తున్న సిబ్బంది

నల్లగొండ టూటౌన్ : మత్స్యశాఖ జిల్లా అధికారిగా చరిత నియమితులయ్యారు. ఇటీవల మత్స్యశాఖ అధికారిగా బదిలీపై వచ్చి విధుల్లో చేరిన నర్సింహారావును ప్రభుత్వం వెంటనే ఇక్కడి నుంచి బదిలీ చేసి చరితను మత్స్యశాఖ అధికారిగా నియమించింది. చరిత గతంలో కూడా మత్స్యశాఖ జిల్లా అధికారిగా పనిచేశారు. శుక్రవారం ఆమె నల్లగొండలోని మత్స్యశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు కార్యాలయ ఉద్యోగులు, మత్స్య సంఘాల నాయకులు బోకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు



గోదామును పరిశీలిస్తున్న డీఎస్‌ఓ

నాంపల్లి : అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. నాంపల్లి మండలంలోని గోదామును శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాం నుంచి ప్రతి నెలా 1వ తేదీన రేషన్ దుకాణాలకు బియ్యం పంపించాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

నిలిచిన ఎత్తిపోతల పనులు



ఎత్తిపోతల పనులు నిలిచిపోవడంతో ఆగిన లారీలు

చందంపేట : నేరెడుగొమ్ము మండలంలోని అంబాభవాని ఎత్తిపోతల పథకం పనులు నిలిచిపోయాయి. నాగార్జునసాగర్ జలాశయంలో నీటి మట్టం పెరగటంతో ఎత్తిపోతల పథకంలో భాగంగా వైజాగ్‌కాలనీ, చిన్న మునిగల్ గ్రామాల మధ్య నిర్మిస్తున్న పంప్ హౌజ్‌లోకి నీరు చేరడంతో పనులు ఆగిపోయాయి. ఈ పనులు ప్రారంభించిన కొద్దిరోజుల్లోనే నిలిచిపోవడంతో ఇక్కడి కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. భారీ వాహనాలు కూడా ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. సాగర్ రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గే వరకు పనులు చేపట్టే అవకాశం ఉండదని ప్రాజెక్టు మేనేజర్ రమేష్ పేర్కొన్నారు.



నీటితో కళకళలాడుతున్న నాగార్జునసాగర్ జలాశయం

ఫొటో : కంది భజరంగ్ ప్రసాద్, నల్లగొండ

ఆయకట్టులో ఆనందం

- ఈసారి ముందుగానే ఎడమ కాలువకు నీటి విడుదల
- ఆగస్టు 2న నీటిని విడుదల చేయడం.. పదేళ్లలో మూడోసారి
- స్విచ్‌ఆన్ చేసి నీటిని విడుదల చేసిన మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి
- ఉమ్మడి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తామని హామీ



స్విచాన్ చేసి ఎడమకాల్వకు నీటిని విడుదల చేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, కలెక్టర్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నాగార్జునసాగర్ ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. గత ఏడాది నీరులేని కారణంగా రెండు పంటలు నష్టపోయిన రైతులు.. ఈసారి ఆగస్టు మొదటి వారంలోనే నీరు విడుదల కావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు 2వ తేదీనే నీటిని విడుదల చేయడం గత పదేళ్లలో ఇది మూడవసారి. శుక్రవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి ఎడమ కాలువకు నీరు విడుదల చేశారు. అనంతరం మంత్రులు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి హామీ ఇచ్చారు. సాగర్ కాలువకే కాకుండా చెరువులు, కుంటలు నింపుతామని హామీ ఇచ్చారు. దీంతో ఈసారి రెండు పంటలకు నీళ్లొస్తాయన్న నమ్మకం రైతుల్లో ఏర్పడింది.

పూర్తిస్థాయిలో సాగునీరు : మంత్రి ఉత్తమ్

సాగర్ ఎడమ కాలువకు నీటిని ఇవ్వడం సంతోషంగా ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కొంత గ్యాప్ తర్వాత శ్రీశైలం, నాగార్జునసాగర్ ఈ స్థాయిలో నిండిందన్నారు. ఇప్పుడు పూర్తి స్థాయిలో నీటిని ఇస్తామన్నారు. దాంతో కాలువల పొడవునా సాగునీరు అందుతుందని, తాగడానికి వినియోగించుకోవచ్చని, చెరువులు నింపుకోవడానికి ఈ నీళ్లు ఉపయోగించుకోవచ్చన్నారు. ఉమ్మడి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు అన్నీ పూర్తి చేస్తామన్నారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్, డిండి, బి.వెల్లంల, పిలాయిపల్లి, ఇతర కాల్వలు, ఎత్తిపోతలు, దేవరకొండ, మిర్యాలగూడ పాత లిఫ్టుల పనులను చేపడతామన్నారు. కొత్త ఎత్తిపోతలకు త్వరలో మంజూరీ ఇవ్వబోతున్నామన్నారు. సాగర్ పరిధిలోని నెల్లికల్ లిఫ్ట్ పనులను వేగవంతం చేస్తామన్నారు. మిర్యాలగూడతోపాటు ఇతర ప్రాంతాల్లో పాతవి పూర్తిసామర్థ్యంతో నడిచేవిధంగా, కొత్తవి పూర్తి చేసేలా చర్యలు చేపడతామన్నారు. గంధమల్ల రిజర్వాయర్‌ను 1.5 టీఎంసీకి తగ్గించి టెండర్లు పిలిచి వెంటనే పనులు మొదలు పెడతామన్నారు. తాము అధికారంలో వచ్చిన మొదటి ఏడాదిలో రైతులకు పూర్తి స్థాయిలో నీళ్లను, అదీ.. ముందుగా ఇస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. శ్రీశైలం నుంచి నీళ్లు వస్తున్నాయని, ఇప్పటికే 180 టీఎంసీల నీరు వచ్చిందని, వారం రోజుల్లోనే సాగర్ నిండుతుందన్నారు. డ్యాం, కాల్వలకు సంబంధించిన అన్ని పనులను చేపడతామన్నారు. అసెంబ్లీ నడుస్తున్న సమయంలో తాము ఇక్కడికి వచ్చామంటే ఈ కార్యక్రమాన్ని ఎంత ముఖ్యమైందిగా తీసుకున్నామో అర్థం చేసుకోవాలన్నారు.



ఎడమకాల్వలో పారుతున్న నీటిని చూస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే

మూడేళ్లలో పూర్తి : మంత్రి కోమటిరెడ్డి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రాజెక్టులను ఐదేళ్లలో కాకుండా మూడేళ్లలోనే పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. గత ఏడాది నీళ్లులేక సాగర్ పరిధిలో, ఏఎంఆర్‌పీ పరిధిలోనూ పంటలు వేసుకోలేకపోయామన్నారు. ఏఎంఆర్‌పీ ద్వారా నీటిని ఇస్తామన్నారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనులకు కొత్త రేట్లు ఇచ్చి వెంటనే పూర్తి చేయడానికి నిధులు విడుదల చేశామన్నారు. వచ్చే మూడేళ్లలో సొరంగ మార్గం, డిండి ప్రాజెక్టు, శివన్నగూడెం, ఇతర రిజర్వాయర్లు పూర్తవుతాయన్నారు. ఏఎంఆర్‌పీ మెయిన్ కెనాల్ లైనింగ్ చేయాల్సి ఉందన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడే గంధమల్లకు రూ.600 కోట్లు ఇవ్వాలని అడిగానని, అయినా ఇవ్వలేదన్నారు. ఇప్పుడు దానిని తమ ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు. దేవరకొండ, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు బాలునాయక్, లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తమ నియోజకవర్గాల్లోని ఎత్తిపోతల పథకాలను పూర్తి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. గంధమల్లను 1.5 టీఎంసీలకు కుదించి త్వరగా పూర్తి చేయాలని కోరారు. మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి మాట్లాడుతూ.. తాను గతంలో తాను ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తి చేయాలన్నారు. తద్వారా ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ నారాయణరెడ్డి, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

553 అడుగులకు సాగర్ నీటిమట్టం

- 5,28,411 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్‌కు వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో సాగర్ నీటి మట్టం శుక్రవారం రాత్రి 9 గంటలకు 553 అడుగులకు చేరింది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరడంతో అదనంగా వచ్చిన నీటిని 10 రేడియల్ క్రస్ట్ గేట్లను 20 అడుగుల మేర పైకెత్తి 4,65,650 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా 61,761 క్యూసెక్కులు కలిపి మొత్తం 5,28,411 క్యూసెక్కుల వరద నాగార్జునసాగర్ జలాశయానికి వచ్చి చేరుతోంది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.5050టీఎంసీలు)కాగా.. ప్రస్తుతం నీటిమట్టం 553 అడుగులకు (215.7660 టీఎంసీలు) చేరింది. నాగార్జునసాగర్ నుంచి కుడి కాల్వకు 5,496 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా దిగువ కృష్ణానదిలోకి 23,878 క్యూసెక్కులు, ఏఎమ్మార్పీకి 1650 క్యూసెక్కులు, కుడికాలకు 907 క్యూసెక్కులు.. మొత్తం 32,331 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మరో వంద టీఎంసీల నీరు సాగర్ జలాశయానికి చేరితే క్రస్ట్‌గేట్లు ఎత్తనున్నారు.

వరద కాలువకు పంప్‌హౌస్ ద్వారా..



కృష్ణాజలాల్లో పూలు చల్లుతున్న మంత్రులు, మాజీ మంత్రి జానా

పెద్దవూర: మండలంలోని పూల్యాతండా సమీపంలోని పంప్‌హౌజ్ ద్వారా ఏఎమ్మార్పీ లోలెవల్ వరద కాల్వకు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి స్విచ్ ఆన్ చేసి 450 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద కాలువ పరిధిలోని చెరువులు, కుంటలను నింపటంతో పాటు ఖరీఫ్‌లో ఆయకట్టుకు సాగునీటిని అందించే ఉద్దేశంతో పంప్‌హౌజ్ మోటార్లను ఆన్‌చేసి నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. వరద కాలువ ద్వారా చెరువులు నింపి సాగునీరు అందిస్తామన్నారు. అనంతరం కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి చీరె, సారెలను సమర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మాజీ జెడ్పీటీసీలు కర్నాటి లింగారెడ్డి, అబ్బిడి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ ఆర్.శంకర్‌నాయక్, బోయ నరేందర్‌రెడ్డి, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్‌బొజ్జ, ఈఎన్‌సీ అనిల్‌కుమార్, సీఈ పీఎస్ నాగేశ్వర్‌రావు, ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ జీజేవీ సత్యనారాయణ, డీఈ వేణు, ఏఈ ఖదీర్, మల్లయ్య పాల్గొన్నారు.

మంత్రుల పర్యటన సాగిందిలా..

నాగార్జునసాగర్ : సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేసేందుకు శుక్రవారం సాయంత్రం రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాలునాయక్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్‌మల్లన్న హెలికాప్టర్‌లో వచ్చి నాగార్జునసాగర్ చేరుకున్నారు. ఎడమ కాల్వ హెడ్‌రెగ్యులేటర్ వద్ద వీరికి పూర్ణకుంభం, వాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం ఎర్త్‌డ్యాం అంతర్భాగంలో గల హెడ్‌రెగ్యులేటర్ ప్యానల్‌బోర్డు వద్ద కలెక్టర్ నారాయణరెడ్డి, నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి పూజలు నిర్వహించి, స్విచాన్ చేసి నీటిని విడుదల చేశారు. కాల్వలో నీరు పారుతుండగా కృష్ణమ్మకు పసుపు, కుంకుమ, చీర, గుమ్మడికాయతో వాయినమిచ్చారు. అనంతరం విజయవిహార్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నీటి విడుదల కార్యక్రమానికి నాగార్జునసాగర్ దేవరకొండ, మిర్యాలగూడ, హుజూర్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చారు.

5 నుంచి 9 వరకు ‘స్వచ్ఛదనం పచ్చదనం’



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ : ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు ×స్వచ్ఛదనం పచ్చదనం® కార్యక్రమాన్ని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ నుంచి మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మొక్కలు నాటడం, తాగునీటి వసతి కల్పన, వీధి కుక్కల బెడద తగ్గించడం వంటి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈ నెల 3న అన్ని గ్రామాల్లో సిబ్బందితో సమావేశం నిర్వహించి కార్యక్రమ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఈ నెల 7వ తేదీన పల్లెనిద్ర చేసి 8న అన్ని గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆయా గ్రామాల్లో నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి పూడ్చి వేయాలని ఆదేశించారు. ఎక్కడైనా తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు ఉంటే వెంటనే అరికట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, డీఎఫ్‌ఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

‘డిండి’ డీపీఆర్‌ను అమలు చేయాలి



మునుగోడు : సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి

దేవరకొండ, మునుగోడు : ఫ్లోరోసిస్ పీడిత ప్రాంతమైన మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సాగు, తాగు నీరు అందించే డిండి ఎత్తిపోతల పథకాని పూర్తిచేసేందుకు డీపీఆర్‌ని వెంటనే ఆమోదించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం దేవరకొండ, మునుగోడులో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016లో జీఓఎంఎస్ నంబర్ 107 ద్వారా డిండి ఎత్తిపోతల పథకంలోని సింగరాజుపల్లి, గొట్టిముక్కల, చింతపల్లి, లక్ష్మాపురం, శివన్నగూడెం రిజర్వాయర్లలో రోజుకు అర టీఎంసీ చొప్పున 30 టీఎంసీల నీటిని నింపి రెండు నియోజకవర్గాలకు సాగు నీరు అందించేలా అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందని తెలిపారు. కానీ ఇప్పటివరకు కనీసం 50 శాతం పనులు కూడా పూర్తికాలేదన్నారు. రైతు పక్షపాతిగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తిచేయడంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రజల నుంచి వ్యతిరేఖత తప్పదన్నారు. ఈ నెల 9వ తేదీన నల్లగొండలో నిర్వహించే ప్రాజెక్టు సదస్సుకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు చాపల మారయ్య, నారి ఐలయ్య, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, కంబాలపల్లి ఆనంద్, నల్ల వెంకటయ్య, రాములు, బిజిలి లింగయ్య, సర్దార్, యాదయ్య, యాదగిరి, రహీం తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఊంజలి సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవోత్సవం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని పట్టువస్త్రాలు,ఆభరణాలతో అలంకరించి, ఆలయ తిరు, మాఢ వీధుల్లో ఊరేగించారు.

• గుడ్డే.. ఫుడ్డు!



ఒక వైపు కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. మార్కెట్‌కు రూ.200 తీసుకెళ్తే.. రెండు, మూడు రకాలకు మించి కురగాయలు రావడం లేదు. దీంతో పలు కుటుంబాలు ప్రత్యామ్నాయ వంటకంగా గుడ్డును ఎంచుకుంటున్నాయి. గుడ్డు తీసుకోవడం ద్వారా ఆరోగ్యంతో పాటు.. ఖర్చు కూడా తగ్గుతుండడంతో ప్రజలు గుడ్డు వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. గుడ్డు వినియోగం పెరగడంతో గతంలో మిర్యాలగూడ పట్టణానికి రోజూ 2 లక్షల గుడ్ల వరకు దిగమతి కాగా.. ప్రస్తుతం దిగుమతి 30 శాతం పెరిగింది. ఇక నాటు కోడి గుడ్లకు డిమాండ్ బాగా పెరగడంతో.. వాటి విక్రయానికి ప్రత్యేక కేంద్రాలు నెలకొల్పడం విశేషం.

– మిర్యాలగూడ టౌన్

ఇంటింటికీ 24/7 తాగునీరు!

- నీలగిరిలో అమృత్–2.0 పనులు షురూ..
- నిర్మాణం కానున్న 12 ట్యాంకులు, 41.63 కి.మీ.పైప్‌లైన్
- ఇప్పటికే రూ.56.75 కోట్లు మంజూరు
- 2026 ఏప్రిల్ నాటికి పూర్తి చేసేలా లక్ష్యం



ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొదలైన ట్యాంకు నిర్మాణ పనులు

నల్లగొండ టూటౌన్: మున్సిపల్ కేంద్రాల్లో ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకు అనుగుణంగా రానున్న రోజుల్లో ప్రతిఇంటికీ 24 గంటల పాటు తాగునీరు సరఫరా చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తోంది. జిల్లా కేంద్రమైన నీలగిరి పట్టణానికి తాగునీటి సరఫరా కోసం అమృత్–2.0 స్కీం కింద రూ.56.75 కోట్ల నిధులు మంజూరు చేసింది. రానున్న 30 సంవత్సరాల్లో పెరగనున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని మున్సిపాలిటీ పరిధిలో తాగునీరు అందించాలని రాష్ట్రంలోనే మొట్టమొదటగా నీలగిరి పట్టణంలోనే అమృత్ స్కీం పనులు ప్రారంభించింది. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కాలనీలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు పైప్‌లైన్‌లు వేయనున్నారు. అమృత్ స్కీం కింద చేపట్టే పనులు పూర్తయితే నీలగిరిలోని 48 వార్డుల్లోని ఇంటింటికీ నల్లాల ద్వారా తాగు నీరందనుంది. ఇందులో భాగంగా 2026 ఏప్రిల్ నుంచి ఇంటింటికీ 24/7 తాగు నీరందిచేందుకు ప్రణాళికలు రూపొందించారు. కానీ ఏడాదిన్నరలోగా అమృత్ పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో మున్సిపల్ యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

41.63 కిలోమీటర్ల మేర పైప్‌లైన్

పిల్లల చదువు, ఉపాధి పనుల కోసం పలు ప్రాంతాల నుంచి వివిధ వర్గాల వారు జిల్లా కేంద్రానికి వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో నీలగిరి పట్టణం నలువైపులా రోజురోజుకు విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో కాలనీల్లోని ప్రతి వీధిలో పైప్‌లైన్‌లు వేసి తాగు నీరందించాల్సి ఉంది. పెరిగిన పట్టణాన్ని దృష్టిలో పెట్టుకొని అన్ని కాలనీల్లో మెయిన్, అంతర్గత పనులు కలిపి మొత్తంగా 41.63 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేయాలని నిర్ణయించారు. మెయిన్ పైప్‌లైన్ 16.36 కిలోమీటర్లు, కాలనీలకు నీటి సరఫరా చేసేందుకు 25.27 కిలోమీటర్ల పొడవునా పైప్‌లైన్ వేయనున్నారు.

తాగునీటి సరఫరా సామర్థ్యం (మిలియన్ లీటర్స్ పర్ డే)

సంవత్సరం	జనాభా	తాగునీటి డిమాండ్
2024	2,34,495	36.41 ఎంఎల్‌డీ
2039	3,15,609	49.00 ఎంఎల్‌డీ
054	4,24,776	65.94 ఎంఎల్‌డీ

ఏడాదిన్నరలోగా పనులు పూర్తిచేస్తాం



నీలగిరి పట్టణంలో అమృత్–2.0 పథకం కింద తాగునీటి పైప్‌లైన్ పనులు పూర్తి చేసేందుకు రెండేళ్ల గడువు ఉంది. అంతకంటే ముందే ఏడాదిన్నరలోగా పనులు పూర్తి చేసి శివారు కాలనీల్లోని ప్రతి ఇంటికీ తాగునీరందిస్తాం. మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో అమృత్ పనులు వేగంగా జరుగుతున్నాయి.

– బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్, నీలగిరి

12 ట్యాంకుల నిర్మాణం..

నీలగిరి పట్టణంలోని అన్ని ప్రాంతాలకు ఒకేసారి తాగునీరు అందించడానికి వివిధ చోట్ల 12 ట్యాంకులు నిర్మించాలని నిర్ణయించారు. మొదట 10 ట్యాంకులే నిర్మించాలని ప్రతిపాదనలు రూపొందించగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చొరవతో అదనంగా మరో రెండు ట్యాంకులు పెంచారు. ఇప్పటికే ఏడు ట్యాంకుల నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభం అయ్యాయి. ఒక్కో ట్యాంకును 5లక్షల లీటర్ల నుంచి 15 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. తాగునీటి పైప్‌లైన్, ట్యాంకుల నిర్మాణాన్ని 2026 మార్చి చివారి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంలో మాదిరిగా కాకుండా పనులు చేపట్టిన కాంట్రాక్టరే ఐదేళ్ల పాటు తాగునీటి సరఫరా నిర్వహణ కూడా చేపట్టే విధంగా ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. పైప్‌లైన్‌లు పగిలిపోయినా, రిపేర్లు వచ్చినా సంబంధిత కాంట్రాక్టరే చేయించాల్సి ఉంటుంది. వాటికి అయ్యే ఖర్చును మున్సిపాలిటీ నుంచి చెల్లించాల్సి ఉంది. అదే విధంగా ప్రతి తాగునీటి ట్యాంకు వద్ద స్కాడా ఏర్పాటు చేయనున్నారు. ఎక్కడ ఏ ట్యాంకుకు ఎన్ని లీటర్ల నీళ్లు వెళ్తున్నాయి.. ఎంత వేగంగా నీటిని పోస్తుంది అనే వివరాలు కూడా స్కాడా వద్ద తెలుసుకునే సౌలభ్యం ఉంటుంది.

క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో చోరీ



చిందరవందరగా పడి ఉన్న దుస్తులు

నేరేడుచర్ల: నేరేడుచర్ల మున్సిపాలిటీలో తాళం వేసిన ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రామాపురం రోడ్డులో గల రావిరాల బ్రహ్మరాంబ బీపీ టాబ్లెట్ల కోసం శుక్రవారం ఇంటికి తాళం వేసి మిర్యాలగూడకు వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళం పగులకొట్టి ఉంది. ఇంట్లో బీరువా తెరిచి ఉండడంతోపాటు, అందులోని బంగారం వస్తువులతో పాటు 36 తులాల వెండి, రూ.10 వేల నగదు చోరీకి గురికావడంతో పోలీసులకు సమాచారం అందించింది. సంఘటన స్థలానికి చేరుకున్న నేరేడుచర్ల పోలీసులు వివరాలను సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో 10 గొర్రెలు మృతి

నార్కట్‌పల్లి: మేత కోసం వెళ్లిన గొర్రెలు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన శుక్రవారం నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జటంగి సోమయ్య గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం గొర్రెలను మేత కోసం గ్రామ శివారుకు తోలుకెళ్లాడు. ఈక్రమంలో మేత మేసిన అనంతరం దాదాపు 10 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. దీంతో రూ.లక్షా70వేల నష్టం వాటిలినట్లు బాధితుడు వాపోయాడు.

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక



భార్గవాచారి

హుజూర్‌నగర్: కర్నాటక రాజధాని బెంగళూరులో ఈనెల 4, 5 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని మాధవరాయినిగూడేనికి చెందిన కన్నెకంటి భార్గవాచారి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం అందుకు సంబంధించిన వివరాలను విలేకరులు తెలిపారు. గతనెల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. తన ఎంపికకు సహకరించిన ఉమ్మడి జిల్లా త్రోబాల్ కోచ్ ఎం.డీ.అక్బర్, తెలంగాణ సెక్రటరీ కిరణ్‌కుమార్, ఇతర అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాత సేవ, ప్రాతకాలార్చన, నిత్యహోమం, మూల విరాట్‌కు పంచామృతాభిషేకం జరిపారు. శ్రీస్వామిఅమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. అనంతరం కల్యాణతంతు నిర్వహించి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశానంతరం మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

వృథా జలాలను ఒడిసిపట్టే.. టెయిల్ పాండ్

- సాగర్‌లో విద్యుదుత్పత్తి చేసిన నీటిని తిరిగి పంపింగ్ చేసేలా నిర్మాణం



టెయిల్ పాండ్ నుంచి విడుదలవుతున్న నీరు

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ వృథా జలాలు ఒడిసిపట్టి.. విద్యుదుత్పత్తి చేయడంతోపాటు రివర్సబుల్ టర్బైన్ల ద్వారా తిరిగి సాగర్‌కు నీటిని మళ్లించేలా టెయిల్‌పాండ్ ప్రాజెక్టు నిర్మితమైంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 21 కిలోమీటర్ల దిగువన పల్నాడు జిల్లా రెంటచింతల మండలం, సత్రశాల, నల్లగొండ జిల్లా, అడవిదేవులపల్లి గ్రామాల మధ్య కృష్ణా నదిపై దీన్ని నిర్మించారు. 2006 జూలై 3న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ ప్రాజెక్టు పనులను ప్రారంభించారు. సుమారు రూ.1100 కోట్లతో 2014లో నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చారు. టెయిల్‌పాండ్ నీటి నిల్వ సామర్థ్యం 7టీఎంసీలు, డెడ్‌స్టోరేజి 6 టీఎంసీలు, లైవ్ స్టోరేజి 1 టీఎంసీ. 1979 నుంచే ఇక్కడ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు ఉన్నప్పటికీ పూర్తి చేయలేకపోయారు. భవిష్యత్‌లో ఎప్పటికైనా టెయిల్‌పాండ్ నిర్మిస్తారనే భావనతో నాగార్జునసాగర్‌లో ఏడు రివర్సబుల్ టర్బైన్లను ఏర్పాటు చేశారు. టెయిల్‌పాండ్ డెడ్‌స్టోరేజీ పైన ఉండే నీటితో సాగర్‌లోని రివర్సబుల్ టర్బైన్ల ద్వారా పీక్ అవర్‌లో విద్యుదుత్పత్తి చేస్తూ.. నీటిని తిరిగి సాగర్‌లోకి పంపిస్తారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టుపై ఆంధ్రా వైపున 50 మెగావాట్ల పవర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు.

టెయిల్ పాండ్ నుంచి నీటి విడుదల

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండల కేంద్రం సమీపంలో గల టెయిల్‌పాండ్ నుంచి శుక్రవారం దిగువకు నీటిని విడుదల చేశారు. నాగార్జునసాగర్ జలాశయం నుంచి 23,610 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. టెయిల్‌పాండ్ నాలుగు క్రస్ట్ గేట్లను 1.20 మీటర్లు పైకెత్తి 27,592 క్యూ సెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు టెయిల్‌పాండ్ డ్యాం ఏఈఈ జైపాల్ తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య



రజిత (ఫైల్)

నకిరేకల్: ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన నకిరేకల్ మండలం నోముల గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. కుటుంబీకుల వివరాలు ప్రకారం.. శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన గుండు శంభయ్య కుమార్తె అనిత అలియాస్ రజిత (28)ను నకిరేకల్ మండలం నోముల గ్రామానికి చెందిన యల్మకంటి శ్రీనుకు 10 ఏళ్ల క్రితం ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఆరేళ్ల బాలుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. శ్రీను, రజిత నోముల గ్రామంలోనే చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శ్రీను, అతడి భార్య రజిత, ఇద్దరు పిల్లలు గురువారం రాత్రి నిద్రకు ఉపక్రమించారు. శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో శ్రీను నిద్ర లేచి చూసేసరికి భార్య కనిపించలేదు. పక్క గది డోర్ తెరిచి చూడగా ఇంటి పైకప్పు పైపునకు ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే శ్రీను భయంతో చుట్టుపక్కల వారిని పిలిచి కిందకు దించారు. అప్పటికే రజిత మృతిచెంది ఉంది. తన భార్యను గ్రామానికి చెందిన ఓ యువకుడు వేధింపులకు గురి చేయడంతోనే ఉరి వేసుకుందని శ్రీను ఆరోపిస్తున్నాడు. ఈమేరకు రజిత మృతదేహాన్ని ఆ యువకుడి ఇంటి ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు. నకిరేకల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ గోపికృష్ణ సంఘటన స్థలాన్ని సందర్శించి వారితో మాట్లాడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అక్కడి నుంచి నకిరేకల్‌కు తరలించారు. కాగా.. ఈ కేసు విషయంలో ఇరువర్గాలు రాజీపడడంతో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాలేదు.

తాటిచెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణం

- జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్న గీతకార్మికుడు



తాటిచెట్టుకు వేలాడుతున్న వెంకటేశం మృతదేహం

మునగాల(కోదాడ): మతిస్థిమితం కోల్పోయిన భార్యకు సేవలు చేయలేక.. ముదివయసులో గీత వృత్తి చేసేందుకు ఒంట్లో సత్తువ లేక జీవితంపై విరక్తి చెందిన ఓ గీతకార్మికుడు.. తనకు ఉపాధి కల్పించే తాటిచెట్టుకే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న హృదయవిదాకర ఘటన మునగాల మండలంలోని ముకుందాపురంలో శుక్రవారం జరిగింది. ముకుందాపురం గ్రామానికి చెందిన గీతకార్మికుడు దేశగాని వెంకటేశం(80)కు సంతానం లేరు. భార్య లింగమ్మ సంవత్సరం క్రితం మతిస్థిమితం కోల్పోయింది. దీంతో వెంకటేశంకు ఇంటిపనితో పాటు భార్యకు సేవలు చేయాల్సి వస్తుంది. ఈ పనులే కాకుండా రోజువారీగా గీతవృత్తి చేస్తున్నాడు. కల్లు గీసేందుకు తాటిచెట్లు ఎక్కడంతో అలసిపోయి కొన్ని రోజులుగా మానసికంగా కూడా కృంగిపోతున్నాడు. ఈ దశలో జీవితం మీద విరక్తి చెందిన వెంకటేశం శుక్రవారం తాటిచెట్టుపైకి ఎక్కి తాటిమట్టకు ఉరివేసుకున్నాడు. కిందకు వేలాడగానే తన ఒంటిపై ఉన్న మోకును వదిలేశాడు. వెంకటేశం బంధువు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కాగా, వెంకటేశం మృతదేహాన్ని గ్రామానికి చెందిన గీత కార్మికులు కీర్తి నర్సయ్య, జూలు నాగార్జున కిందకు దింపే ప్రయత్నంలో ఒక్కసారిగా తాడు తెగడంతో మృతదేహం జూలు నాగార్జునపై పడింది. ఆయనకు స్వల్పగాయాలయ్యాయి.

చైతన్య సదస్సును జయప్రదం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న క్యాట్ కో ప్రతినిధులు

భువనగిరిటౌన్ : తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య (క్యాట్ కో) దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో నిర్వహించనున్న వినియోగదారుల చైతన్య సదస్సును జయప్రదం చేయాలని క్యాట్ కో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలె వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్వీ హోటల్ లో సదస్సు కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10,11(శని, ఆదివారం) నిర్వహించనున్న వినియోగదారుల సంఘాల సమాఖ్య (క్యాట్ కో) చైతన్య సదస్సు, వర్క్ షాప్ కు రాష్ట్ర మంత్రులు, వివిధ శాఖల అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు. వినియోగదారుల రక్షణ చట్టం 2019, ఆన్ లైన్ మోసాలు, డ్రగ్స్, కల్తీ మొదలగు వాటిపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పోచం సోమయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా బాధ్యులు కొడారి వెంకటేష్, జంపాల అంజయ్య, బాలేశ్వర్, చంద్రశేఖర్, యాదగిరి, బాబు, సిద్దుల వెంకటేష్, దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు రామచంద్రయ్య పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతి



మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

నల్లగొండ: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నల్లగొండకు చెందిన డీలర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి నాగరాజు మాట్లాడుతూ.. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలతో డీలర్లు ఇబ్బంది పడుతున్నారన్నారు. రేషన్ బియ్యం సరఫరా చేసే గోదాం పాయింట్లలో వేబ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని కోరారు. క్వింటాకు 1300 గ్రాముల ఖాళీ బస్తానే ఉంటుందని, దానికి కూడా బియ్యం ఇవ్వాలని, ఉచిత బియ్యం పంపిణీకి సంబంధించి కమిషన్‌ను అదే నెలలో మంజూరు చేయాలని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో ప్రధాన కార్యదర్శి వైద్యుల సత్యనారాయణ, మాజీ కోశాధికారి దోగుపర్తి సత్యనారాయణ, మసూద్ కలీం ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మిర్యాలగూడ టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం మృతిచెందాడు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం ఆలగడప గ్రామానికి చెందిన ఇంద్రపల్లి సైదులు (42) గురువారం గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్డు దాటుతుండగా కోదాడ నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో అతడి తలకు బలమైన గాయం కావడంతో ముందుగా ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి అన్న ఇంద్రపల్లి సోమయ్య ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ వీరాంజనేయులుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా.. మృతుడికి వివాహం కాలేదు.

జ్యూయలరీ షాపులో చోరీకి యత్నం

- సీసీ పుటేజీలో గుర్తించిన షాపు యజమాని
- పోలీసుల అదుపులో నిందితురాలు



మిర్యాలగూడ పట్టణంలోని పెద్దబజారులో గల జ్యూయలరీ షాపు వద్ద గుమిగూడిన జనం

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని పెద్దబజారులో గల జ్యూయలరీ షాపులో శుక్రవారం ఓ మహిళ బంగారు నగల చోరీకి యత్నించింది. వివరాల ప్రకారం.. బుర్ఖా ధరించిన ఓ మహిళ పట్టణంలోని భవాని జ్యూయలరీ షాపునకు వచ్చింది. బంగారు ఆభరణాలు పరిశీలిస్తూ బేరం ఆడింది. అప్పటికే దుకాణంలో వినియోగదారుల రద్దీ ఎక్కువగా ఉండటంతో సేల్స్ ప్రమోటర్లు బిజీగా ఉండటాన్ని గమనించిన సదరు మహిళ రెండు బంగారు ఆభరణాలను తీసుకుని బయటకు వచ్చి ఆటోలో వెళ్లేందుకు ప్రయత్నించింది. ఇది సీసీ పుటేజీలో రికార్డు కావడంతో షాపు యజమాని గుర్తించి కేకలు పెట్టడంతో స్థానికులు ఆటోను అడ్డుకున్నారు. గమనించిన ఆటో డ్రైవర్ పారిపోగా మహిళ స్థానికుల చేతికి చిక్కింది. ఆమెను జ్యూయలరీ షాపులోకి తీసుకెళ్లి తనిఖీ చేయగా బంగారు ఆభరణాలు లభ్యమయ్యాయి. పోలీసులకు సమాచారం అందించగా వారు అక్కడకు చేరుకుని మహిళను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కాగా.. పోలీసుల అదుపులో ఉన్న సదరు మహిళ సీతారాంపురం కాలనీకి చెందినదిగా స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ చేస్తున్నారు.

గుండెపోటుతో వలస కార్మికుడు మృతి



పంచనామా నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీను

కట్టంగూర్: బతుకుదెరువు కోసం వచ్చిన వలస కార్మికుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతుండగా శుక్రవారం గుండెపోటు రావడంతో మృతిచెందాడు. ఈ ఘటన కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం సోనాముఖి జిల్లా భంకూర మండలం బొండలతి గ్రామానికి చెందిన దిబాస్ బౌరి(19) కట్టంగూర్‌లోని ఓ కంపెనీలో కాంట్రాక్టర్ వర్కర్‌గా గత కొంతకాలంగా పనిచేస్తున్నాడు. ఈనెల 1వ తేదీన తీవ్ర కడుపునొప్పికి గురికావడంతో తోటి కార్మికులు నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అదేరోజు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స సమయంలో గుండెపోటు రావడంతో శుక్రవారం మృతిచెందాడు. సహచర కూలీ ఆకాశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీను తెలిపారు.

బత్తాయి కూలీల ఆటో బోల్తా..

- విద్యార్థి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

చండూరు: చండూరు మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి బత్తాయి కూలీల ఆటో బోల్తా పడి ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నాంపల్లి మండలం నేరెళ్లపల్లికి చెందిన కడారి అనిల్ (17) దామర భీమనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం తన తల్లిదండ్రులు శ్రీను, రజితతో కలిసి ఆటోలో 11 మందితో గుర్రంపూడ్ మండలం చామలోనిబాయి గ్రామంలోని ఓ రైతుకు చెందిన తోటలో బత్తాయి కాయలు తెంపేందుకు వెళ్లాడు. తిరుగుప్రయాణంలో రాత్రి చండూరు మున్సిపల్ కేంద్రంలోని పాత పారాబాయిల్డ్ రైస్ మిల్ సమీపంలో అతి వేగంగా వస్తున్న ఆటో ఒక్కసారిగా పల్టీ కొట్టింది. ఇందులో ప్రయాణిస్తున్న అనిల్ అక్కడికక్కడే మృతి చెందగా.. తండ్రి శ్రీనుతో పాటు మరో ఐదుగురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ వాహనాన్ని వేగంగా నడుపుతూ సడన్ బ్రేక్ వేయడంతోనే పల్టీ కొట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆటో డ్రైవర్ సాగర్ల శివకు స్వల్పగాయాలు కాగా.. పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది.

విద్యుత్ స్తంభాన్ని బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

నాంపల్లి: విద్యుత్ స్తంభాన్ని బైక్ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన నాంపల్లి మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మర్రిగూడ మండలంలోని కొండూర్ గ్రామానికి చెందిన వల్లపు కొండల్ (39)బత్తాయి వ్యాపారం చేసుకుంటూ మర్రిగూడ మండల కేంద్రంలోని కొత్తగూడెంలో జీవనం సాగిస్తున్నాడు. వ్యాపారంలో భాగంగా నాంపల్లి మండలంలోని పలు గ్రామాల్లో తిరిగి కొండూర్‌కు బైక్‌పై వస్తున్నాడు. ఈక్రమంలో నాంపల్లి మండలంలోని స్వాములవారి లింగోటం గ్రామంలో రాత్రి 8 గంటల సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు.. ఒకరు మృతి

వలిగొండ: వలిగొండ మండలంలోని నర్సాయగూడెం గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఆత్మకూర్(ఎం) మండలంలోని పల్లెర్ల గ్రామానికి చెందిన వల్లపు నర్సింహ(60) వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్రవాహనంపై వలిగొండకు వచ్చాడు. తిరిగి మధ్యాహ్నం గ్రామానికి ప్రయాణమయ్యాడు. ఈక్రమంలో నర్సాయగూడెం గ్రామ సమీపంలో మొద్దులకుంట చెరువు వద్ద కారు అతివేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన నర్సింహ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్‌లాల్ తెలిపారు.

వృద్ధురాలి దారుణ హత్య

- నార్కట్‌పల్లి మండలం బి.వెల్లంలలో ఘటన
- గ్రామానికి చెందిన యువకుడే హత్య చేశాడని గ్రామస్తుల ఆరోపణ



వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ



జానకమ్మ (ఫైల్)

నార్కట్‌పల్లి: ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలు హత్యకు గురైన సంఘటన శుక్రవారం ఉదయం నార్కట్‌పల్లి మండలంలోని బి.వెల్లంల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం.. బి.వెల్లంల గ్రామానికి చెందిన రెబ్బ జానకమ్మ (72)కు సంతానం కాకపోవడంతో ఆమె భర్త గత కొన్నేళ్ల క్రితం మరో వివాహం చేసుకుని చౌటుప్పల్‌లో ఉంటున్నాడు. దీంతో జానకమ్మ గ్రామంలో ఒక్కత్తే ఉంటోంది. ఆమె గురువారం చౌటుప్పల్‌కి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి చేరుకుంది. శుక్రవారం ఉదయం 7 గంటలైనా ఇంట్లోంచి బయటికి రాకపోవడంతో ఇంటి పక్కన ఉన్న వారు ఆమెను పిలిచారు. ఆమె పలకకపోవడంతో దర్వాజ సందులోంచి చూడగా ఇంటి లోపల బైక్ ఉంది. ఇంట్లో ఉన్నది ఎవరు అని అడగగా.. గ్రామానికి చెందిన ఓ యువకుడు స్పందించాడు. ఎందుకు వచ్చావని ఆ యువకుడిని ప్రశ్నించడంతోనే అతను తలుపు తీసి బైక్‌పై పరారయ్యాడు. గ్రామస్తులకు అనుమానం వచ్చి ఇంటిలోకి వెళ్లి చూసేసరికి జానకమ్మ మృతి చెంది ఉంది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ నాగరాజు, ఎస్ఐ క్రాంతికుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. జానకమ్మను హత్య చేసి ఆమె మెడలో ఉన్న దాదాపు 10 తులాల బంగారం, కొంత నగదు దొంగలించినట్లు పోలీసులు గుర్తించారు. కాగా.. బైక్‌తో పరారైన యువకుడి కుటుంబ సభ్యులకు జానకమ్మ రూ.లక్ష అప్పు ఇచ్చిందని గ్రామస్తులు పోలీసులకు వివరించారు. గత 20 రోజుల క్రితం ఇంట్లో చోరీ జరిగిందని, అదే సమయంలో అప్పు పత్రం కూడా పోయినట్లు జానకమ్మ తమతో తెలిపిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆ యువకుడే ఇంట్లోకి దూరి ఒంటరిగా ఉన్న ఆమెను హత్య చేశాడని గ్రామస్తులు తెలిపారు. డీఎస్పీ శివరాంరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అయితే యువకుడు తీసుకున్న అప్పు కోసమే హత్య చేసి ఉంటాడా.. ఇందులో ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు. కాగా.. జానకమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

తిరుమలగిరి (తుంగతుర్తి): విషం తాగి యువకుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం తిరుమలగిరి మండలం కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం నందనం గ్రామానికి చెందిన గిరిబాబు(22) తిరుమలగిరి మండలం అనంతారం గ్రామానికి చెందిన యువతిని ఇటీవల ప్రేమించి వివాహం చేసుకున్నాడు. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో యువతి తన తల్లిగారింటికి వచ్చింది. దీంతో మనస్తాపం చెందిన గిరిబాబు తిరుమలగిరికి చేరుకుని ఓ వెంచర్‌లో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని తుంగతుర్తికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ ట్రాలీ అపహరణ

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో ట్రాక్టర్ ట్రాలీని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి అపహరించారు. బొబ్బల ఇంద్రారెడ్డి తన వ్యవసాయ బావి వద్ద ట్రాక్టర్ ఇంజన్‌కు నాగళ్లు అమర్చి ఉండడంతో ట్రాలీని మరో చోట ఉంచాడు. గుర్తు తెలియని వ్యక్తులు మరో ట్రాక్టర్ ఇంజన్ సాయంతో ట్రాలీని అపహరించారు. బాధిత రైతు శుక్రవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



నాగార్జున సాగర్ ఎడమ కాలువకు సాగునీటిని విడుదల చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



లోలెవెల్ కెనాల్ నుంచి విడుదలవుతున్న నీరు



ఎడమ కాల్వకు నీటి విడుదల అనంతరం పూజలు చేసి గుమ్మడికాయ హారతి పడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి